మూగజీవాల లెక్క పక్కా!

- ఫిబ్రవరి వరకు పశు గణన
- ప్రక్రియ పూర్తి చేసిన ప్రతి ఇంటిపై స్టిక్కర్

పుల్లలచెరువు: మండలంలో వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమపై 70 శాతం పైగా చిన్న, సన్నకారు రైతులు ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని పేద రైతులంతా ఒకటి, రెండు పశువుల పెంపకంతో కొంత ఉపశమనం పొందుతుంటారు. ఈ క్రమంలో మండలంలో 120 రోజుల పాటు పశుగణన చేపట్టనున్నారు. ఇదే సమయంలోనే గతంలో ట్యాగ్‌లు వేయని వాటికి కూడా ప్రస్తుతం ట్యాగ్‌లు వేస్తున్నారు. మండలంలోని 19 సచివాలయాల పరిధిలో సిబ్బందిని నియమించినట్లుగా అధికారులు తెలిపారు.

16 రకాల పెంపుడు జంతువుల లెక్క

మండలంలో ఉన్న గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు కాక మొత్తం 16 రకాల పక్షులు, జంతువులు ఉన్నాయి. ప్రతి ఇంటికీ వెళ్లి కచ్చితమైన గణన పూర్తి చేసేలా నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు భాగస్వామ్యంతో కేంద్రం రూపొందించిన యాప్ ద్వారా లెక్కింపు ఉంటుంది. గణన పూర్తి చేసిన గృహాలపై స్టిక్కర్ అంటిస్తారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారులు వచ్చిన సమయంలో ఆ ఇంటిపై స్టిక్కర్‌ను యాప్ ద్వారా వచ్చిన సంఖ్యను పరిశీలించుకుని సరిచూసుకుంటారు. ఏ మాత్రం తేడా వచ్చినా సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇచ్చామని, వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు నిరంతరంగా ఈ ప్రక్రియగా కొనసాగుతుందని చెప్పారు. ఉదయం పశుగణన పూర్తి చేసుకుని మధ్యాహ్నం విధులకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. గోపాలమిత్రలను కూడా ఇందులో భాగస్వామ్యం చేశామని, యాప్ ద్వారా నిర్వహించే పశుగణన రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డ్యాష్ బోర్డుపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. యర్రగొండపాలెం క్లస్టర్ పరిధిలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, దోర్నాల మండలాలుండగా వాటి లెక్క తేల్చనున్నారు.


పుల్లల చెరువులో పశుగణన సర్వే చేస్తున్న సిబ్బంది

జంతువుల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు	కోళ్లు
యర్రగొండపాలెం	4074	12859	33667	26081	7827
పుల్లలచెరువు	4961	15185	40039	20566	10126
దోర్నాల	2433	8194	28853	16835	9076

సద్వినియోగం చేసుకోవాలి

21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గణనకు సంబంధించి సిబ్బందిని సిద్ధం చేసి గ్రామాల్లో సర్వేకు పంపించాం. 16 రకాల జంతువులు, పక్షులు కచ్చితమైన లెక్కింపు చేయాల్సి ఉంటుంది. చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేలా ప్రభుత్వ పథకాల రూపకల్పనకు పశుగణన ఎంతో ఉపయోగపడుతుంది. గ్రామాల్లో నిర్వహిస్తున్న పశుగణనకు పశుపోషకులు సహకరించాలి.

– డాక్టర్ నాగుల్‌మీరా, పశువైద్యాధికారి, పుల్లలచెరువు

క్లుప్తంగా

గుంటి గంగమ్మకు ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న గుంటి గంగాభవాని అమ్మవారు

తాళ్లూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవాని అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారు జామున అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. అమ్మవారిని అందంగా పూలమాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

11 మంది బీఎల్‌ఓలపై ఫిర్యాదు

తాళ్లూరు: ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, కలెక్టర్ ఉత్తర్వులను పాటించకుండా విధులకు గైర్హాజరైన 11 మంది బీఎల్‌ఓలపై చర్యలు తసుకోవాలని తహసీల్దార్ జె. ఇమ్మానియేల్ ఆర్‌ఓ లోకేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఆదివారం పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఏలు పోలింగ్ బూత్‌లలో డ్రాఫ్ట్ ఔట్ లిస్టలను పబ్లిష్ చేయలేదని, ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో విధులకు హాజరు కాలేదని పేర్కొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు

దర్శి: విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభ విజయవంతం చేయాలని సహ బౌద్ధిక్ ప్రముఖ్ రామకృష్ణ కోరారు. స్థానిక అభిరాం ఫంక్షన్ హాలులో హైందవ సభ ఏర్పాట్లపై నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రముఖులతో సమావేశం ఆదివారం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా, కులమతాలకు అతీతంగా విజయవాడలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభకు ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఏరువ లక్ష్మీ నారాయణరెడ్డి, మాడపాకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీశైలం వెళ్లే దారిలో భక్తుల రద్దీ

పెద్దదోర్నాల: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధి గాంచిన శ్రీశైల పుణ్యక్షేత్రానికి భారీగా తరలివచ్చే భక్తులతో ఆదివారం మండల కేంద్రం కిక్కిరిసిపోయింది. రాష్ట్ర నలుమూలాల నుంచి భక్తులు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి భారీగా తరలి వస్తుండటంతో మండలంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు, గంటూరు, కర్నూలు ప్రాంతాల నుంచి శ్రీశైలానికి అధికంగా యాత్రికులు తరలి వస్తున్నారు. ఎస్సై మహేష్ ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు పలు ప్రాంతాల్లో సిబ్బందిని కేటాయించారు.

వాసవీ కళ్యాణ మండపానికి శంకుస్థాపన

బేస్తవారిపేట: మండల కేంద్రమైన బేస్తవారిపేటలో వాసవీ కళ్యాణ మండపం నిర్మాణానికి ఆదివారం వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. లక్ష్మీ గణపతి, నవగ్రహ, వాస్తు, అమ్మవారి మూల మంత్ర హోమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

దేవాలయాల్లో విశేష పూజలు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేసూతల కాటమరాజుస్వామి, గంగాభవాని, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన శ్రీ అంకాళమ్మ దేవతకు, ఎస్. కొత్తపల్లి గ్రామం సమీపంలో శ్రీ నాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తి శ్రద్ధలతో ఆదివారం విశేష పూజలు చేశారు. ఆలయ పూజారి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవారికి వారికి సమర్పించారు. మహిళలు నాగమయ్య పుట్టలో పాలు పోసి పండ్లు, పొంగళ్లు, అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, గాజులు, చీరలు మహిళలు సమర్పించారు. కాటమరాజుస్వామి ఆలయ ప్రాంగణం చుట్టు యాదవులు భక్తిశ్రద్ధలతో బొల్లావును నెత్తిన పెట్టుకుని తప్పెట్లతో ఊరేగింపుగా ఆనందోత్సవంతో ప్రదక్షిణలు చేశారు. కార్తీకమాసం సందర్భంగా వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని, కాయ కర్పూరం సమర్పించి, మొక్కులు చెల్లించారు.


అలంకారంలో వేసూతల కాటమరాజుస్వామి

ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి


దర్శిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న లోకేశ్వరరావు


మాట్లాడుతున్న లోకేశ్వరరావు

దర్శి: వచ్చే ఏడాది జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించాలని దర్శి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, డిప్యూటీ కలెక్టర్, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ ఎంవీఎస్ లోకేశ్వరరావు సూచించారు. నియోజకవర్గంలోని బొట్లపాలెం, తూర్పు గంగవరం, దోసకాయలపాడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడుతూ ప్రచురితం కాబోయే ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచుతూ కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన ఓటర్ల తొలగింపు, మార్పులు, చేర్పులు నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్ డే రోజున పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తమ సమస్యలు దరఖాస్తు రూపంలో అందజేసి అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రతి బీఎల్‌ఓ పోలింగ్ కేంద్రం వద్ద తప్పని సరిగా ఉండాలని ఓటర్లకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కురిచేడు: స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా మండలంలోని పోలింగ్ బూత్‌లను ఆదివారం ఎన్నికల అధికారి లోకేశ్వరరావు పరిశీలించారు. జనవరిలో ప్రచురితం కాబోయే ఓటర్లజాబితా డ్రాఫ్ట్ లిస్ట్ అందుబాటులో ఉంచుతూ కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు, చేర్పులు, మార్పులను ఆదివారం బూత్‌లెవల్ అధికారులు ప్రతి బూత్‌లో ఉండి నిర్వహించారు. బూత్‌లెవల్ అధికారులు చేస్తున్న పనులను, ఓటరు జాబితాలను, సంబంధిత ఫారాలను పరిశీలించారు.

ఆకాశాన్నంటుతున్న ధరలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు


కర ప్రతాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

దొనకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక ధరల భారాలు, మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న లైంగిక దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు జరిగే పోరులో పాల్గొనాలని సీపీఎం దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు పిలుపునిచ్చారు. ఆదివారం దొనకొండ బస్టాండ్ సెంటర్, వీరవెంకటాపురం సెంటర్‌లో ప్రజా పోరు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, చార్జీలు పెంచబోమని చెప్పి నేడు మాట మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలపై రూ.20 వేల కోట్ల విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారం వేశారని రంగారావు తెలిపారు. మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ గత నెల రోజులుగా కూరగాయలు, నిత్యావసర వస్తువులు ఆకాశాన్ని అంటుతున్నాయని, రోజు వారీ సరుకుల కొనుగోలులో ధరల భారం కనిపిస్తోందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు అదుపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడులు రోజు రోజుకూ పెరుగుతున్నాయన్నారు. దీంతో చాలా మంది ఆడ పిల్లల ఆచూకీ కనపడని సంఖ్య పెరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్భాటంగా వాగ్దానాలు చేసి నేడు నిమ్మకు నీరెత్తినట్లు ప్రజల క్షేమం పట్టించుకోకుండా ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తోందన్నారు. ఉచిత ఇసుక విధానం నేటికీ రాలేదని, భవన కార్మికులు రవాణా, వాహన యజమానులు ర్యాంపుల కార్మికులు, నిర్మాణదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పరిష్కరించాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని అంజయ్య కోరారు. 14వ తేదీ కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ధర్నా చేస్తామన్నారు. మండల ప్రజలంతా పాల్గొన్ని జయప్రదం చేయాలని అంజయ్య కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అంజయ్య, కుందుర్తి చిన్న నరసింహులు, ఉదయ్, సంతోష్, పెద్దయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజా సమస్యలపై కూటమి నిర్లక్ష్యం

పుల్లలచెరువు: నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఐ సీనియర్ నాయకుడు చెన్నయ్య ఆరోపించారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు.. తీగలేరు సాధన కోసం రైతు సంఘం ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించింది. కాలువ పరివాహక ప్రాంతాలైన కొమరోలు, మల్లాపాలెం, యండ్రపల్లి, వెంకటరెడ్డిపల్లి, ఉమ్మడివరం , పుల్లలచెరువు గ్రామాల్లోని రైతులను కలిసి ప్రాజెక్టు ఆవశ్యకత గురించి మాట్లాడారు. అనంతరం విలేకరులతో సీపీఐ నాయకుడు చెన్నయ్య మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు అంతర్గత భాగమైన టి 5 బ్లాక్ వీరాయిపాలెం వరకు పూర్తి అయిందన్నారు. దానిని పుల్లలచెరువులోని చిన్న కండ్లేరు చెరువు వరకు పూర్తి చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో కాలువ సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి ఇచ్చారని.. కానీ కూటమి నాయకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 11500 ఎకరాలు సాగులోకి వస్తుందని, దీంతో తాగు నీరు కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు రామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయడంలో విఫలమయిందన్నారు. సీపీఐ మండల కార్యదర్శి గురునాథం తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి భూమి పూజ

దర్శి: స్థానిక టీడీటీ కళ్యాణ మండప నిర్మాణానికి భూమి పూజ ఆదివారం జరిగింది. శిలాఫలకాన్ని మాగుంట శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. గత ప్రభుత్వంలో డిసెంబర్ నెలలో ఇదే ఎంపీ ఇదే ప్రదేశంలో ఇదే టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన చేయగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో పాటు హాజరయ్యారు. పనులు ప్రారంభించకుండా మళ్లీ శిలాఫలకం ఆవిష్కరించడంపై టీటీడీనా... లేక టీడీపీనా అని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం దర్శి రైల్వే స్టేషన్‌ను ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. అక్కడ ఉన్న వసతులను పరిశీలించారు. అక్కడకు వచ్చిన వారిని రైల్వే స్టేషన్ ఏర్పాటుపై తమ అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపు శెట్టి పాపారావు, టీడీపీ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు.


టీటీడీ శిలాఫలకం ప్రారంభించిన ఎంపీ మాగుంట

సీపీఎం ప్రజాపోరు సదస్సు రేపు

పెద్దారవీడు: మార్కాపురం పట్టణం ప్రెస్‌క్లబ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు సదస్సును మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. ఈమేరకు సీపీఎం డివిజన్ నాయకులు సోమయ్య ఆదివారం తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు హాజరవుతారని, అన్ని తరగతుల ప్రజలు, వెలిగొండ నిర్వాసితులు, రాజకీయాలకు అతీతంగా హాజరై సదస్సు విజయవంతం చేయాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టు నీటిని వెంటనే విడుదల చేయాలని, బడ్జెట్‌లో రూ. 2 వేల కోట్లు నిధులు కేటాయించాలని, మెడికల్ కళాశాల తరలింపును నిలుపుదల చేయాలని కోరారు. నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, మార్కాపురం జిల్లా ఏర్పాటు, విద్యుత్ చార్జీలు, ఇసుక, మద్యం, మహిళలపై దాడులు, తదితర అంశాలపై ప్రజాపోరు సదస్సులో చర్చిస్తామని పేర్కొన్నారు. మండలంలో గ్రామాల నుంచి రైతులు, ప్రజా సంఘ నాయకులు, ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న మోతుకూరి మురళీకృష్ణను దర్శి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం అరెస్టు చేశారు. సీఐ కె. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం తమకు అజ్ఞాత వ్యక్తి అందించిన సమాచారం మేరకు తన సిబ్బంది ఎస్. శ్రీనివాసులు, పి. నాగరాజు, సీహెచ్ సాయిబాబాతో కలిసి మురళీ కృష్ణ ఇంటిని తనిఖీ చేయగా సిల్వర్ స్ట్రిప్స్ ఒరిజనల్ రిజర్వ్ విస్కీ 15 క్వార్టర్ బాటిళ్లు లభ్యమైనట్లు తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని మురళీకృష్ణను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వరుస దాడులు జరిగి బెల్టు షాపుల యజమానులను అరెస్టు చేస్తున్నా ఇంకా బెల్టు షాపులు నిర్వహించటంపై మండిపడ్డారు. ప్రజలు బెల్టు షాపులు నిర్వహించకుండా వేరే వ్యాపారాలు చేసుకోవాలని, బెల్టు షాపులు నిర్వహిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బతుకుదెరువుకోసం అనేక వ్యాపారాలున్నాయని హితవుపలికారు.


నిందితునితో సీఐ, సిబ్బంది

దేవస్థాన కమిటీ సభ్యుల సమావేశం నేడు

పెద్దారవీడు:

మండలం పరిధిలో నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేసూతల కాటమరాజుస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు దేవస్థానం చైర్మన్ పల్లెబోయిన వెంకటరాజు యాదవ్ ఆదివారం తెలిపారు. దేవాలయంలో కళ్యాణ కట్ట, షెడ్డు నిర్మాణం, అరుగుల ఏర్పాటు, మొక్కలు నాటడం, తదితర విషయాలపై సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆలయ కమిటీ సభ్యులు, శాశ్వత సభ్యులు, సేవా సమితి సభ్యులు, ఆలయం అభివృద్ధి కోసం పాటుపడే ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

అయ్యప్పలకు అల్పాహారం

పెద్దదోర్నాల: మండల పరిధిలోని అయ్యప్ప మాల ధారులకు స్థానిక సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ షెక్షావలి పాల్గొని అయ్యప్పలకు అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా షెక్షావలి మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనని, కులమతాలకు అతీతంగా జరిగే కార్యక్రమంలో అయ్యప్పలు స్థానిక అయ్యప్పలతో పాటు, మిగతా ప్రాంతాల నుంచి వచ్చే అయ్యప్ప స్వాములకు సైతం అల్పాహారాన్ని అందించడం అభినందనీయమన్నారు. యూనియన్ సభ్యులు దాసు, సర్దార్, అయ్యప్ప భక్తులు వేణుగోపాలరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రతాప్, నారాయణ, బొచ్చు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్పలకు అల్పాహారం అందిస్తున్న డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు

దేవాలయాల పరిరక్షణకు ఏకం కావాలి

త్రిపురాంతకం: హిందూ దేవాలయాల పరిరక్షణకు అందరూ ఏకం కావాలని విశ్వహిందూపరిషత్ ప్రముఖులు పిలుపునిచ్చారు. త్రిపురాంతకం ఆలయాల వద్ద హిందూ దేవాలయాల పరిరక్షణకు ఆదివారం నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. హిందూ దేవాలయాల ఆస్తుల పరిరక్షించాలని, దేవాలయాల్లో అన్యమతస్తులకు ఉద్యోగాలు ఇవ్వరాదన్నారు. ఆలయాలకు చెందిన భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, హిందూ దేవాలయాల వద్ద అన్యమత ప్రచారాలకు తావులేకుండా చూడాలని హిందూ ఆలయాలకు ధార్మిక బోర్డు ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జనవరి 5 వతేదీన హైందవ శంఖారావం సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, విద్యార్థి పరిషత్, ఎస్ఎస్ఎఫ్‌కు చెందిన ప్రముఖులు రామకృష్ణ, గురుస్వామి, నాగిరెడ్డి, రమణయ్య, విశ్వం జి.నాగబ్రహ్మచారి పాల్గొన్నారు.


త్రిపురాంతకంలో మాట్లాడుతున్న రామకృష్ణ

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. ఆలయ ఆవరణలోని నాగ శిలలు, పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు. అలాగే కళాశాల రోడ్డులో ఉన్న పోలేరమ్మ వారికి భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?


గనివానిపాడు సమీపంలో రోడ్డు ఇలా..


వాగుమడుగు సమీపంలో ఇలా..

కొనకనమిట్ల: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు రహదారులు కోతకు గురై నడవటానికి సైతం ఇబ్బందికరంగా మారాయి. అడుగుకో గుంత, బారెడుకో గతుకు అన్నట్టుంది మండలంలోని వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రోడ్డు పరిస్థితి. రోడ్డుపై తారు మొత్తం దెబ్బతిని కంకర పైకి తేలడంతోపాటు గోతులు ఏర్పడటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోందని ప్రజలతో పాటు వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా రహదారి మధ్యలో చప్టాల వద్ద ఇరువైపులా రోడ్డు కోతకు గురైంది. అలాగే గనివానిపాడులో కొద్దిపాటి వర్షం పడినా గ్రామంలో వర్షం నీరు బయటికి వెళ్లే మార్గం లేక వీధుల్లోనే నిల్వ ఉంటోంది. దీంతో జనం నడవడానికి ఇబ్బందికరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.